క్లుప్తంగా

ఈ-క్రాప్ జాబితా సరిచూసుకోండి

హిందూపురం టౌన్: హిందూపురం డివిజన్ పరిధిలో రబీ 2022–23 సీజన్‌లో 7,467 మంది రైతులకుగాను 11,042 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు చేయడంతో పాటు రైతుల ఈ-కేవైసీ 97 శాతం పూర్తిచేశామని వ్యవసాయశాఖ ఏడీ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌బీకేలలో ప్రదర్శిస్తున్న రబీ 2022–23 సీజన్‌కి సంబంధించి క్రాప్ ముసాయిదా జాబితా ఈనెల 13 నుంచి 17 వరకు సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తున్నామని, గ్రామసభలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ సభలలో ఆర్‌బీకే సిబ్బంది జాబితాలో ఉన్న రైతుల వివరాలను వినిపించడం జరుగుతుందన్నారు. రైతులందరూ సమీప రైతు భరోసా కేంద్ర పరిధిలో సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే సవరణ కోసం రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వీపీసీ, వీహెచ్, పీకేవీ, ఎస్‌పీలను సంప్రదించాలన్నారు. 2022–23 రబీ సీజన్ సవరణకు ఇది ఆఖరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎలాంటి మార్పులు, చేర్పులు చేయడం జరగవని స్పష్టం చేశారు.

లబ్ధిదారులకు బైకుల పంపిణీ



లబ్ధిదారులకు బైక్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: స్థానిక ఆది జాంబవ అభివృద్ధి మండలి నుంచి ఎంపికైన 20 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకటరమణప్ప ఉచిత మోటారు బైకులను సోమవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణప్ప మాట్లాడుతూ షోరూముల్లో బైకు కొనాలంటే రూ లక్షకు పైగా ఖర్చు అవుతుందని.. అయితే సర్కారు ఈ యోజనలో లబ్ధిదారులకు రూ.70 వేల సబ్సిడీతో వాహనాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామాంజినప్ప, తప్పెట సుబ్బరాయప్ప, మండలి అభివృద్ధి అధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పర్లందరూ సహకరించండి

పావగడ: తన తండ్రి ఎమ్మెల్యే వెంకటరమణప్ప గెలుపునకు సహకరించిన స్థానిక ఉప్పర సామాజిక వర్గం ప్రజలు వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు సైతం సహకరించాలని స్థానిక విధాన సభ క్షేత్రం కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వీ వెంకటేష్ కోరారు. స్థానిక నవనిధి కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న చళ్లకెరె సర్కిల్ సమీపంలో జరిగే కాంగ్రెస్ ప్రజా ధ్వని కార్యక్రమానికి ఉప్పరలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కేపీసీసీ చైర్మన్ డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటరమణప్ప, తాలూకా ఉప్పర సంఘం అధ్యక్షుడు బి కృష్ణప్ప, అశ్వర్థప్ప, అక్కులప్ప, నాగరాజు, వెంకటరమణప్ప తదితర ఉప్పర సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులకు చెక్

మడకశిర రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు చెక్ పెట్టొచ్చని డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తెలిపారు. సోమవారం చందకచెర్లులో పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, దోమల నివారణ తదితర వాటిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఉచిత వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభావతిబాయి, డాక్టర్ వినోద్‌కుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

మడకశిర: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ సిబ్బంది రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 35 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రక్తదానం చాలా గొప్పదని, రక్తదానంతో ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శశిరేఖ, ల్యాబ్ టెక్నీషియన్ సిబ్బంది అరుణ్‌కుమార్, అనిల్, చిట్టిబాబు, రహంతుల్లా, హేమంత్, సాయి, మురళి, లోకేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆస్కార్ రావడం హర్షణీయం

పెనుకొండ: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ రావడం హర్షణీయమని అధ్యాపకులు ప్రతాప్ పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం తెలుగు జాతి గర్వపడే విషయమన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుల బృందం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. జూనియర్ ఎన్‌టీఆర్, రాంచరణ్ ఈ పాటకు చేసిన డ్యాన్సును కొనియాడారు. అధ్యాపకులు గంగరాజు, నాగరాజు, ముత్యాలప్ప తదితర యువకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉదయం 8 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన ఓటర్లు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు
- పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోన్ని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఓటింగ్ ప్రశాంతంగా పూర్తవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



అమరాపురం: బారులు తీరిన ఓటర్లు

హిందూపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం హిందూపురం నియోజకవర్గంలో సజావుగా జరిగాయి. ఉదయం 8 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. చివరి గంట సమయంలో ఓటర్లు పెద్ద సంఖ్యలోనే తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సమయం ముగిసేలోపు కేంద్రం వద్ద ఉన్న ఓటర్లను మాత్రమే అనుమతించి అధికారులు పోలింగ్ పూర్తి చేశారు. సాయంత్రం 4.35 గంటలకు పూర్తిగా పోలింగ్ ముగిసింది. హిందూపురం నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు 5,718 ఉండగా వారిలో 4,244 ఓట్లు పోలయ్యాయి. 74.02 శాతంగా నమోదైంది. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 785 ఉండగా 750 ఓట్లు పోలవడంతో 95.06 శాతంగా నమోదైంది.

కట్టుదిట్టమైన పోలింగ్ బందోబస్తు

డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఓటర్లను వారి ధ్రువీకరణ పత్రాలు చూసిన తర్వాత మాత్రం పోలింగ్ కేంద్రం వైపు పంపించారు. వివిధ పార్టీల నాయకులు, ఇతరులను బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన గేటు బయటనే నిలిపివేశారు. పెద్ద సంఖ్యలో వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు రోడ్డులోనే గుమిగూడి ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గింది. పోలింగ్ కేంద్రం వద్ద అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్లు తహసీల్దార్ సౌజన్య, కమిషనర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

పోటాపోటీగా పర్యవేక్షణ

పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ పర్యవేక్షణ కోసం వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోటీ పడి మరీ పోలింగ్‌ను పర్యవేక్షించడం విశేషం. టీడీపీ నాయకులు ఇండిపెండెంట్ అభ్యర్థులకు ఏజెంట్లుగా మారి పోలింగ్ కేంద్రాల వద్ద తిరిగారు. టీడీపీ నాయకులు అటు ఇటు తిరుగుతూ ఓటర్లను ఒత్తిడి చేసే రీతిలో ప్రవర్తించడం విమర్శలకు దారి తీసింది. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైస్ చైర్మన్‌బలరామిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, ఇతర నాయులు పోలింగ్‌ను పరిశీలించారు.

పెనుకొండ: పట్టణంలో సోమవారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగింది. పట్టభద్రుల ఓట్లు 1660 ఉండగా 1426 ఓట్లు పోలయ్యాయి. టీచర్ ఎమ్మెల్సీ ఓట్లకు సంబంధించి 96 ఓట్లకుగాను 92 ఓట్లు పోలయ్యాయి. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల నుంచి సైతం ఓటర్లు భారీగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇబ్బందిపడిన ఓటర్లు

200–ఎ పోలింగ్ బూత్‌లో ఓటర్లు చీకటి కారణంగా ఓటు వేయడానికి కొంత ఇబ్బంది పడ్డారు. అయితే తహసీల్దార్ స్వర్ణలత, నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పోలింగ్ సిబ్బందితో మాట్లాడి వెంటనే తగిన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు.

● ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మడకశిరలో ఎమ్మెల్యే తిప్పేస్వామి తన ఓటు హక్కును వినియోగించుకున్న తర్వాత విలేకర్లతో మాట్లాడారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపడం ఎవరితరం కాదన్నారు.

గెలుపు వైఎస్సార్‌సీపీదే

● ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ బలపర్చుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థులందరూ గెలవబోతున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ సమన్వయకర్త కొండూరు మల్లికార్జున పోలింగ్ పరిశీలించారు. అనంతరం పోలింగ్ కేంద్రం బయట ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూనే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల సరళి చూస్తే ఓటర్లు ప్రభుత్వానికి అండగా నిలిచారని, అందుకే పోలింగ్ శాతం కూడా పెరిగిందన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పట్టభద్రుల ఓటర్లు 1119 ఉండగా 934 , ఉపాధ్యాయ ఓట్లు 35కు 35 ఓట్లు పోల్ అయినట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

గోరంట్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పట్టభద్రుల ఓట్లు 1640 ఓట్లు ఉండగా 1333 మంది , అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 138 ఓట్లు ఉండగా 133 మంది ఓటేశారు. పోలింగ్ కేంద్రాన్ని పుట్టపర్తి ఆర్‌డీఓ భాగ్యరేఖ పరిశీలించారు. అలాగే ఎమ్మెల్యే శంకరనారాయణ ఎన్నికల తీరును పరిశీలించారు.

పోలింగ్ కేందాలను పరిశీలించిన డీఎస్పీ

లేపాక్షి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పెనుకొండ డీఎస్పీ యశ్వంత్ పరిశీలించారు. ఓటర్లుకు ఏ ఇబ్బందులు లేకుండా ఎస్ఐ మునీర్ అహ్మద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మడకశిర: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆయా మండలాల ఎస్ఐలు నాగేంద్ర, వెంకటేశ్వర్లు, లావణ్య, మునిప్రతాప్, వెంకటరమణ ఇతర పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నియోజకవర్గంలో భారీ పోలింగ్

పట్టభద్రుల ఓటర్లు నియోజవర్గంలో మొత్తం 4,151 మంది ఉండగా 3,181 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల స్థానానికి 76 శాతం పోలింగ్ నమోదైంది. అదే విధంగా ఉపాధ్యాయ స్థానానికి 92 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. 211 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 196 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మడకశిరలో...

మడకశిరలో రెండు పోలింగ్ కేంద్రాల్లో 1,526 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 1,224 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 115 మంది ఉండగా 106 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అగళిలో ...

అగళిలో పట్టభద్రుల ఓటర్లు 456 మంది ఉండగా 387 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇద్దరు ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా ఇద్దరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గుడిబండలో...

గుడిబండ మండలంలో 632 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 498 మంది ఓటు వేశారు.అలాగే 22 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 20 మంది ఓటు వేశారు. అమరాపురంలో...

అమరాపురంలో 1,145 పట్టభద్రుల ఓటర్లు ఉండగా 794 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 49 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 47 మంది ఓటు వేశారు.

రొళ్లలో...

రొళ్ల మండలంలో 392 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 354 మంది ఓటు వేశారు. అలాగే 22 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 21 మంది ఓటు వేశారు.

పరిగి: పరిగి మండలంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 905 పట్టభద్రుల ఓటర్లకుగానూ మొత్తం 765 మంది , టీచర్స్ ఓటర్లు 87 మందిలో 84 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి పోలింగ్‌ను పర్యవేక్షించారు. జెడ్పీ హెచ్ పాఠశాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పరిశీలించారు.

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఓట్లు 830 ఉండగా 722 ఓట్లు పోల్ అయ్యాయి. టీచర్ల ఎమ్మెల్సీ ఓట్లు 29 ఉండగా అందులో 28 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే శంకరనారాయణ పరిశీలించారు.



పెనుకొండ: పోలింగ్ కేంద్రానికి వస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎమ్మెల్యే శంకరనారాయణ



రొళ్ల: పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



సోమందేపల్లి: బ్యాలెట్ బాక్సులు తరలిస్తున్న దృశ్యం



పెనుకొండ: పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్త్ నిర్వహిస్తున్న పోలీసులు



హిందూపురం: చంటిబిడ్డను ఎత్తుకుని ఓటేసేందుకు వచ్చిన మహిళ



హిందూపురం: ఓటుహక్కు వినియోగించుకున్నట్లు చూపుతున్న ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ దంపతులు



రొద్దం: బారులు తీరిన ఓటర్లు



లేపాక్షి: పోలింగ్‌పై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి



ఓటు హక్కు వినియోగించుకుంటున్న మాజీ మంత్రి రఘువీర

త్వరలోనే లోఓల్టేజీ సమస్యకు చెక్

- సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

గోరంట్ల: మండల పరిధిలలోని కమ్మవారిపల్లి గ్రామానికి నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగానే సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు సోమవారం గ్రామ సర్పంచ్ సాపట్ల మణి, విద్యుత్‌శాఖ అధికారులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కమ్మవారిపల్లి, గంగంపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ప్రస్తుతం గోరంట్ల సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫర జరుగుతోంది. ఆయా పంచాయతీల పరిధిలోని గ్రామాలు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చాలా దూరంలో ఉండటంతో నిత్యం లోఓల్టేజీ సమస్యతో రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ దృష్టికి తీసుకెళ్లాంతో సమస్యను ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో కమ్మవారిపల్లికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించినట్లు కమ్మవారిపల్లి సర్పంచ్ సాపట్ల మణి తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే గంగంపల్లి, కమ్మవారిపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలకు లోఓల్టేజీ సమస్య పరిష్కరించినట్లవుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ కదిరి డివిజనల్ ఇంజినీర్ శ్రీకాంత్, ఏఈ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమ్మవారిపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

● దాహం తీరింది

హిందూపురం టౌన్: వేసవి మొదలవడంతో సూర్యుడు భగభగా మండుతున్నాడు. ఎండ దెబ్బకు మనుషులకే కాదు జంతువులకు కూడా గొంతెండిపోతోంది. సోమవారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న ప్రాంతంలో ఓ వానరం నీటి కోసం నానా అవస్థలు పడింది. గమనించిన పట్టణ ఎస్‌బీ కానిస్టేబుల్ శేషు వానరానికి తన వద్ద ఉన్న నీటి బాటిల్‌ను అందించారు. అయినా దాని దాహం తీరకపోవడంతో మళ్లీ వైఎస్సార్‌సీపీ నాయకుడు నౌషాద్ కూడా మరో వాటర్ బాటిల్‌ను వానరానికి అందజేయగా నీటిని తాగిన మర్కటము అక్కడి నుంచి తాపీగా వెళ్లిపోయింది.



ఒక బాటిల్ తాగి పక్కన పెట్టి.. మరో బాటిల్ నీళ్లను కూడా తాగుతున్న వానరం

ఘనంగా మొల్లమాంబ జయంతి

హిందూపురం టౌన్: తెలుగు రామాయణ రచయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను హిందూపురం కుమ్మరి, శాలివాహనులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం పట్టణంలో మొల్లమాంబ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ హిందూవులకు ఎంతో ప్రత్యేకం, పరమ పూజ్యమైన రామాయణాన్ని మొల్లమాంబ తెలుగు భాషలోకి తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, ఉపాధ్యక్షుడు రాజప్ప, ప్రధాన కార్యదర్శి భాస్కర్, శివకుమార్, వెంకటేష్, మహేష్, మోహన్, ఆదినారాయణ, మారుతీ, లక్ష్మీదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో వద్ద కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. కుమ్మర కుల సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఐకృతతో కుమ్మర కులస్తులు తమ హక్కులను సాధించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ వెంకటరత్నం, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట నారాయణ, నాయకులు రమణ, జగదీష్, కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌లో గణిత ఒలంపియాడ్ మినీ జూనియర్స్ లెవెల్‌లో ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించిన 5వ తరగతి విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు అభినందించారు. స్థానిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీ గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గణిత ఒలంపియాడ్ 49వ జాతీయ గణిత ప్రతిభా పరీక్షకు ఇటీవల నిర్వహించిన మినీ జూనియర్స్ లెవెల్‌లో పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వీరిలో దీపక్‌కుమార్, రామ్‌చరణ్ 3వ ర్యాంకు, జ్ఞానేశ్వర్ నాయక్ 4వ ర్యాంకు, బాబాజాన్ 5వ ర్యాంకు, నితిన్ కళ్యాణ్‌రెడ్డి, సిరిల్‌రాజుకు 7వ ర్యాంకు, విక్రమ్ కళ్యాణ్, ప్రశాంత్‌కుమార్ 8వ ర్యాంకు, మనోభిరామ్ 10వ ర్యాంకును సాధించారన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులందరికీ ఈనెల 15న గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో అబ్దుల్ కలాం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో సన్మానిస్తారన్నారు. గణితశాస్త్ర ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు అరుణ, పవన్‌కుమార్ శర్మను ప్రిన్సిపాల్ అభినందించారు.

సాగు భూముల్ని స్వాధీనం చేసుకోవద్దు

పావగడ: తాలూకా వ్యాప్తంగా కొన్నేళ్లుగా భూములను సాగుచేస్తున్న రైతుల నుంచి భూములను స్వాధీనం చేసుకోకూడదని స్థానిక కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట సోమవారం పెద్ద ఎత్తున చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ బీడు పడిన ప్రభుత్వ భూముల్ని వ్యవసాయ భూములుగా మార్చి పంటలు పండించుకుని జీవనం సాగిస్తున్న రైతుల నుంచి బలవంతంగా భూముల్ని లాక్కోవడం సరికాదన్నారు. స్థానిక కేఆర్‌పీపీ అభ్యర్థి నేరళె కుంటె నాగేంద్ర ఆందోళనకు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ సుజాతకు వినతి పత్రం అందించారు. అంతకు ముందు రైతు సంఘం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర రైతు సంఘం నాయకురాలు మంజుల ఎస్ అక్కి తదితరులు పాల్గొన్నారు.